


# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఫిబ్రవరి 2013

సంపుటి : 19 **218** సంచిక : 2




## దేశంలో మంచితనం వంచింపబడుతూన్నంత వేగంగా చెడు చెట్టాపట్టాలేసుకు తిరుగుతూంటుంది!

## చేవగల భారతీయుడా! ఛేదించుకురారా!!

మానవత్వ మూలమైన మంచి, మంచులా కరిగిపోతూన్నది. చెడ్డ మాటలు చేటు కలిగిస్తాయన్న సత్యమెరిగిన మనిషే మానవత్వానికి తిలోదకాలిస్తున్నాడు, కులమతాల కలవరాలు, ప్రాంతీయ విభేదాలు, విడిపోవాలనెడి భావం, కలివిడిని కసితీరా కుమ్మి పోస్తున్నది.

ధనమద అధికంబు, అధికార దాహంబు ధరణిపై గగ్గోలు పెడుతూంది. పది మాసాలు మోసి పెంచిన తల్లినీ, తన ప్రతి రూపంగా పుట్టిన బిడ్డను, అక్కలను, చెల్లెళ్ళను సహితమూ వావివరసలు లేకుండా అ(హ)త్యాచారములు చేయడానికి జనులు వెనుకాడడంలేదు.

కామ ప్రవృత్తిగల మనుషులే అధికంగా ఉండడంతో, మానవత్వం మృగ్యమైనదా, మచ్చుకైనా మంచితనం దృశ్యం కాదా– అన్న సందేహం అడుగడుగునా కలుగుతున్నది; అణు వణువునా దహించి వేస్తున్నది.

లౌకిక వాదానికే తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్న నెహ్రూ, సమసమాజ నిర్మాణమే తన ధ్యేయమన్న అంబేద్కర్ భావం. భారతదేశాన్ని పారంపర్యంగా ప్రభవింప చేస్తున్న సనాతన ధర్మసూత్రములే! వారేంవి క్రొత్తగా సృష్టించిన ధర్మాలు కావు. ఈ అరవై ఆరేళ్ళలోనూ పాలకులేమైనా అభివృద్ధి ప్రణాళికల్ను అమలుపరిచారా– అంటే సమాధానం శూన్యం.

నెహ్రూ మంత్రి వర్గంలోని ముస్లిముయైన విద్యాశాఖామంత్రి అబ్దుల్‌కలామ్ అజాద్ విద్యా ప్రమాణాన్ని పెంచే ప్రయత్నం చేసాడు. ఉపప్రధానిగా ఉన్న వల్లభాయ్ పటేల్ అంతః శత్రువుగా ఉన్న నైజాము నవాబు కోరలను విరిచి, నైజాము రాష్ట్రాన్ని భారత అంతర్దేశంగా కలిపాడు. కానిచో భారత్‌లో అదొక పాకిస్థానయి– దేశంలో కల్లోలం చెలరేగింపచేసేది. పాక్‌లో సరిహద్దు గాంధీగా పేరు పొందిన గఫూర్‌ఖాన్ భారత్‌కు అండగా ఉండబట్టి, పాకిస్థాన్ కబళించాలనుకొన్న భారతభూమిని కబళించ కుండా ఉడతాభక్తి చూపాడు. ఉద్దండప్రబుద్ధుడు వల్లభాయ్‌పటేల్ తరువాత మరో కేసరి లాంటివాడు, వల్లభపంత్ కొంత స్వతంత్రంగా, తన సత్తాతో భారతభూమి కాపుదలకు తోడ్పడ్డాడు. ‘అటు తరువాత కాంగ్రెసులో మంత్రులుగా వచ్చినవారు నెహ్రూ కుటుంబులే అయ్యారు. ప్రకాశం పంతులు, కామరాజ్, నాడార్, నిజలింగప్ప కాంగ్రెసు విధాన అక్షణాలను దిద్దుటకు విముఖత తెలిపి బయటకు వచ్చారు. తరువాత కాంగ్రెసు స్వరూపాన్ని తనకు అనుకూలమైన వారితో ఇందిరాగాంధీ కాంగ్రెస్–ఐ (అఖిలభారత కాంగ్రెసు–ఐ ఇందిర) అభయ హస్త ముద్రికగా మువ్వన్నెల పతాక కాంగ్రెసును జనంలోకి తెచ్చింది. వేయి కాళ్ళ మండపం కూల్చినట్టుగ ఆ కాంగ్రెస్ అంతర్ధానం కావడం, కమ్యూనిష్టులు రెండుగా చీలిపోవడం, సోషలిస్టు పార్టీ ప్రజా సోషలిస్టు పార్టీగా మారడం వంటివి జరిగింది.

గుమ్మం తగిలి బొప్పి కట్టినా, ఏంవీ జరగనట్టుండే కొత్త కోడలి నవ్వులా, పాతసీసాలో కొత్త సారా పోసుకుంటూన్నట్టు, నాయకులు పార్టీలు మారుకుంటూ వచ్చే సంస్కృతికి మొగ్గ తొడగడం, అనంతరం దానికి తొడిమి తొడగడం, కాలం మార్పుల్లో దేశాన్ని పుక్కిట పట్టే నాయకులు రావడం జరిగింది.

కాలం మారింది అంటారు, కాలానుగుణ మార్పులు వచ్చాయంటారు. కాలానికి రూపంలేదు అనేది లేదు. అందుకే కాలానికి పాపం అంటకట్టవద్దన్నాడో రచయిత. కాలం అద్దం లాంటిది. మన చేష్టలనే ప్రతిబింబిస్తుంది.


ఆకలితో అల్లాడుతూ మర్రిచెట్టు నీడలో మరణించిన ముసలి వాళ్ళను చూస్తున్నాం. నిండు చూలాలు నడిరోడ్డున ప్రసవించి మూర్ఛిల్లిన స్త్రీని చూస్తున్నాం. కన్నతల్లి కనిన పసికందును పెంటకుప్పల్లో పడేసే ఘోరాన్ని చూస్తున్నాం. ప్రేమ పేరుతో కన్నెతనాన్ని దోచుకుని హత్యలు చేసిన యువతను చూస్తున్నాం. ఇటీవల ఘోరాతి ఘోరంగా, రాచబాటలో వెడ్తూన్న బస్సులో ఆరుగురు ధూర్తులు సామూహిక అత్యాచారం చేసి, ఆ వెనుక ఆమె పేగుల్ని లాగి, కాలేయం చిదిపి, రోడ్‌పై తోసేయడం చూసాం. నాకు బ్రతకాలని ఉన్నదని ఆ కన్నెపడుచు అరిచినా పట్టించుకోని క్రూర రాక్షసుల్ని చూసాం. తల్లి పేగు నుంచి పుట్టినవారే కదా వారు! కామం తీర్చుకుని ఏ కనికరమూ లేకుండా అంతటి క్రూరత్వానికి ఒడంబడిన విషయం భారతదేశమే కాదు; ప్రపంచమంతా విస్తుపోయింది.

**ఏంవమ్మా! తల్లీ భారతీ– నీ దృష్టికీ కిరాతకం కనపడలేదమ్మా!**

క్షమించు. నీవు భారతదేశం కాదు కదా! ఇంగితం లేని ఎంగిలి పీసు ఇండియా కదమ్మా! ఎవడు పెట్టాడమ్మా నీకీ ‘ఇండియా’ పేరు. అన్ని నగరాలకూ తమ తమ తరాల పేరులు పెట్టుకుంటున్నా– నీ పేరు నీ సహజనామంగా ‘భారతీ’ అనో, ‘భారతదేశం’ అనో మార్చాలనే జ్ఞానం వారికి ఈ 66 సంవత్సరముల పాలనా కాలంలో కలుగకపోవడం విచారకరమమ్మా! **జనగణమన అధినాయక జయహే భారత భాగ్య విధాతా!’** అన్న జాతీయగీతంలోని ‘ఆణిముత్యపు’ భారతపదం చెవులకు సోకడం లేదా!

దేంవుడా– రక్షించు నా దేశాన్ని–ప్రక్రూరుల నుండీ... పతితల నుండీ, పెద్ద మనుషుల నుండీ, పెద్ద పులుల నుండీ, నీతుల రెండునాల్కలు చాచి బుసలు కొట్టే నిర్హేతుక క్రూర సర్పాలనుండీ, లక్షలాది దేవుంళ్లనుండీ, వారి పూజారుల నుండీ– అన్న కవి మాటలు వినిపించడం లేదమ్మా! –అవునమ్మా– వందకోట్లు దాటిన మనుజ సంతతిలో ఎందరికని చెబుతావు? ఎందరు భారతీయులుగా ఉన్నారని చెబుతావు. క్రీ.శ. ఈ 2012 సంవత్సరాలలో భారతీయులెందరు మిగిలి ఉన్నారని చెబుతావమ్మా!

చెంవిటి వారి చెవుల్లో శంఖం ఊదడమనే నాకు తెలుసు. మనం ఉండబట్టలేదమ్మా! కానీ ఏ మూలనో ‘ఏ ప్రఫుల్ల సుమంబుల ఈశ్వరునకు పూజ సల్పితినో యేను’ అన్న మమకారం చావక– కలదయేని పునర్జన్మ ఈ దేశమున కలుగుగాక! అను ఆశాపాశం నన్ను బంధిస్తూన్నది. తల్లీ భారతీ! భారతీయులకు శుభ సంపదలనొసగే జ్ఞానమునొసగమమ్మా!



బుధజన విధేయుడు
*గోటేటి శ్రీరామారావు*


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



### శ్రీ శివ స్తుతి

బ్రహ్మమురారి సురార్చిత లింగమ్
నిర్మలభాసిత శోభిత లింగమ్ ।
జన్మజ దుఃఖ వినాశక లింగమ్
తత్ప్రణమామి సదా శివలింగమ్ ॥



# శివుడే ఐశ్వర్య ప్రదాత!

త్రిజగాల్లోని త్రిమూర్తుల్లో ఐశ్వర్యప్రదాత, అభయప్రదాత ఎవరంటే పరమశివుడనే చెప్పాలి. ఆయన్ను భోళాశంకరుడని కూడా చెప్పుకోవాలి. సురులకుగానీ, అసురులకుగానీ, గంధర్వులకు గానీ కోరిన వెంటనే వరాలిచ్చేవాడు శివుడే! అందుకే ఆయన్ను పరమశివుడన్నారు, పరమేశ్వరుడన్నారు. తన వరంతో ఏదైనా భస్మం కావాలని వరం కోరిన భస్మాసురునికి కూడా వరం యిచ్చిన ఉదారుడు. కన్నడనే మూఢభక్తి గల బోయవానికి సహితమూ ముక్తిని ప్రసాదించిన మహాదేవుని క్షేత్రమే శ్రీ కాళహస్తి క్షేత్రం. మార్కండేయుడనే బాలుణ్ణి, యమపాశాల బారి నుంచీ రక్షించి చిరాయుష్మంతుణ్ణి చేసిన శంకరుడు భోళాశంకరుడు గాక మరెవ్వరు?

తన్ను తపస్సుతో మెప్పించిన పర్వతాజ పుత్రిక పార్వతిని పరిణయమాడి తన శరీరంలో అర్థభాగం యిచ్చి, అర్ధాంగిగా చేసుకుని, స్త్రీ జాతి మోక్షప్రదాతయినవాడు, పరమశివుడే!

శివుణ్ణి సేవించే భక్తుల కోసం విశ్వనాథుడై కాశీ క్షేత్రంలో కలి యుగాంతం వఱకూ ఉంటానని 'బాస' చేసి, కాశీలో విశాలాక్షీ, అన్నపూర్ణ, గంగాదేవిలతో కలిసి, మెలసి, కలిదోష ప్రభావానికి ఎరగాకుండా, యుగాంతం వరకూ అక్కడేఉండి, మోక్షం ప్రసాదించుదునని బాస చేసి కొలువు ఉన్నవాడు విశ్వనాథుడు. కాశీలో మరణిస్తే కైలాసప్రాప్తి కలుగుతుందని బాస చేసి ఎందరో భావించి అవసానదశలో కాశీవాసం చేస్తారు. శ్రీరామచంద్రుడంతటివాడు రామేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసి, పూజలు చేసాడు. ఇలా అనేక శివలింగాలయ ప్రతిష్ఠను శ్రీరామచంద్రుడే చేసినట్టు భారతదేశ ఆలయ చరిత్ర చెబుతున్నది. శివాలయమూ, రామాలయమూ లేని ఆంధ్ర గ్రామము లేదన్నది ప్రామాణికత సత్యం. దక్షిణాదిన శివ పంచారామాలున్నట్లే, ఉత్తరాదిని కూడా పంచరామాలున్నాయ్.

త్రిలింగ ఆలయాలున్నందునే ఆంధ్రదేశానికి త్రిలింగదేశమూ, తెలుగుదేశమూ అనే పేరు కల్గిందన్న విషయం ఎంతోమందికి విదితమే!

**శివకేశవ అభేధాన్ని ఆదిశంకర భగవత్పాదులు విశదీకరించాడు.**

శివరాత్రి ప్రతీ మాసమూ వస్తుంది. మహాశివరాత్రి మాఘమాసం బహుళ చతుర్దశినాడే వస్తుంది. ఆరోజున రెండు త్రిదళ బిల్వ పత్రాలనైనా శివలింగంపై నుంచి ముక్తి మోక్షములు పొందండి శివరాత్రి మహాత్మ్యం తెలుసుకోండి.

సంగీత, సాహిత్య, నృత్యాలకు అధిదేవతాయనే! క్షీరసాగర మదనంలో అమృతానికి ముందు, వాసుకి గళం (విషం)బయటకు వచ్చినప్పుడు ఆయనే గరళాన్ని ఆస్వాదించి కంఠంలో నింపుకుని గరళకంఠుడయ్యాడు. దానితో ఆయన కంఠం నీలంగా మారిపోయింది. ఆ కారణంగా ఆయన్ను నీలకంఠుడన్నారు.

రాక్షసులు దుష్టులని తెలిసి, వారికి కోరిన వరాలిచ్చిన, బోళా శంకరుడు. శంకరుడు అంటే శుభంకరుడు. అందుకే పెద్దలు **శివానుగ్రహ ప్రాప్తిరస్తు.** ఆయన్ను స్మరిస్తే మృత్యువు కూడా పారిపోతుంది. అనారోగ్యంగా ఉన్నప్పుడు, మృత్యుంజయ మంత్రం జపిస్తూ, హోమం చేస్తే ఆరోగ్యం సిద్ధిస్తుంది.

శంకరుని పేర్లలో 'వ్యోమకేశు' అని కూడా ఉంది. 'వ్యోమ' అంటే ఆకాశమే, 'కేశః' అన తల జుట్టుగా కలిగినవాడని అర్థం. ఆకాశాన్ని శిరోజాలుగా కలిగి వుండడమేమిటట?

ఇలాంటి రహస్యాలతో నిండిన ఆ తల ఆకాశానికి సంకేతం! అంటే 'ఆకాశం ఓ రహస్యాల పుట్ట'. లెక్కకు మించిన (అసంఖ్యాకం) విషయాల్ని చెప్పాల్సొచ్చినప్పుడు తలజుట్టుని చేత్తో స్పృశిస్తూ ఈ మాటలే అంటాం. శంకరుని తల అనేది ఆకాశం కాబట్టే, ఆకాశ గంగ అనేది ఆయన తలమీదే ఉంటుంది. ఆయన శిరసే ఆకాశం కాబట్టి, ఆకాశంలో ఉండే చంద్రుడు ఆయన తలమీదే కన్పిస్తూంటాడు. ఆయన నివాసం కూడా ఆకాశమంత ఎత్తున ఉండే కైలాసం. ఒక చేతిలో ఢమరుకం, మరో చేతిలో త్రిశూలం, కరుణాపూరిత హస్తం గల గరళకంఠుడాయన.

## ఆయన పాపహారుడు

మాఘ బహుళ చతుర్దశి మహాశివరాత్రి పరమ పవిత్రమైనది. ఆదిదేవుడు లింగరూపంగా అవతరించిన రోజని, పార్వతీ పరమేశ్వరుల వివాహ శుభదినమని ఈ పర్వదినానికి ప్రశస్తి. ఈ శివరాత్రి పర్వదినాన విభూతిధారణ చేసి జరిపే పూజలు, ఉపవాసం, జాగరణ వల్ల పాప విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మిక. శివునికి ప్రీతిపాత్రమైన బిల్వదళాలతో శివలింగార్చన చేస్తారు. బిల్వపత్రాలు లక్ష్మీ నివాస స్థలం. పూజా సమయాలలో భక్తులు శివ మహిమ్న స్తోత్రం, శివతాండవ స్తోత్రం, **ఓం నమశ్శివాయ** అనే పంచాక్షరీ మంత్ర జపం చేయడం శుభం. సన్యాసాశ్రమ స్వీకారం చేసేవాళ్ళు ఈ మహాశివరాత్రి రోజే సన్యాసదీక్ష తీసుకుంటారు.

మహాభారతంలో శివరాత్రి మహత్యమెంతటిదో ఇలా చెప్పబడింది: వారణాశిలో ఉండే సుస్వరుడనే బోయవాడు ఒకరోజు అడవిలో సంచరిస్తూ చీకటిపడే సమయానికి దిక్కుతోచక ఒక బిల్వ వృక్షాన్ని ఆశ్రయంగా (తరువాయి 5వ పేజీలో)

# భాష లేకుండా బ్రతకగలడేగాని, దుర్భాషలాడకుండా ఉండలేడు తెలుగువాడు!

**2012** సంవత్సరంలో తెలుగువారు చేసుకున్న పాపపుణ్యముల పరిణామ శాతమేమో గానీ, మాండలికములో గుట్టుగా ఉన్న బూతుల కట్టను బయల్పెట్టారు. దరిద్రుడు, దద్దమ్మ చవట, శుంఠ, సాగరంలోకి విసిరేస్తాను, శ్రాద్ధం పెట్టేస్తాను, గడ్డిబొమ్మగా కట్టి దహనం చేసేస్తాను. గృహదహనం చేస్తాను... బస్సుల టైర్లలోని గాలి విప్పేస్తాను. బస్సులను తగుటపెట్టేస్తాను. రైళ్ళను నడవనీయం, రైలుపట్టాలను విరగ్గొడతాం. రైలు బోగీలను తగలపెడతాం. విద్యార్థులను చదవనీయం. ఉద్యమాల్లో వారిని ఉసిగొలిపి ముందు వరుసలో నిలబెడతాం. ఉసురుపోయిన వారికి అమరవీరులంటూ సమాధులు కడతాం. అంజలులు సమర్పిస్తాం. వారి సమాధులకు పాలాభిషేకం చేసి వచ్చిన వారందరికీ 'అంబలి' పంచుతాం. అమర వీరుల కుటుంబాలకు 'గంజి'యైనా పోసిన తృప్తి అయినా ఉంటుంది. రోడ్డురాకాలు చేసి, రోడ్డుపైననే వంటా వార్పులు చేద్దాం. రోడ్లనే బహిర్భూములు చేద్దాం. విద్యుత్ స్తంభాలను పీకేద్దాం. విద్యుత్ సౌధాలను ధ్వంసం చేద్దాం. పోలీసులపై రాళ్ళు రువ్వుదాం, ఆసుపత్రులకు డాక్టర్లను వెళ్ళకుండా చేద్దాం. నరసమ్మలను, వార్డుబాయ్‌లను ఘోరావ్ చేద్దాం. ప్రభుత్వ ఆఫీసులను కూల్చేద్దాం! ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేద్దాం. ఫర్నీచర్ను తగలేద్దాం. ముఖ్యమంత్రిని దద్దమ్మం దాం. మంత్రులకు అవినీతిని అంటకడదాం (అవినీతిపరులు ఉన్నారనుకోండి). వారి దిష్టిబొమ్మలను గడ్డితో  చేసి తగలపెడతాం. పశువులకు ఎండుగట్టి లేక పోయినా ఫరవాలేదు, దిష్టిబొమ్మలుగా, వాళ్ళను తగులపెట్టడమే మన ధ్యేయం. భావి భారత పౌరులైన విద్యార్థులకు ఉద్యమాలందు ఉత్సుకత కల్పించాలన్నా, ఉత్సాహం పెల్లుబికేట్టు చేయాలన్నా వారిని ముందుంచడమే శ్రేయమనే నిర్ణయానికి అన్ని రాజకీయ పార్టీలూ వచ్చేసాయి. వేలమంది విద్యార్థుల వీరమరణం చెందారని మొసలి కన్నీరు కార్చారు. ఏ పార్టీ వారికి తగ్గట్టు ఆ పార్టీ పత్రికలున్నాయ్. పరస్పర పరుష దూషణలు ప్రచురించాలంటే వారికి పాయసం తిన్నట్టే!

ఆంధ్రదేశంలో బొగ్గు ఉత్పత్తి గాకుండా విద్యుదుత్పత్తి గాకుండా, రవాణా సదుపాయాలు లేకుండా చేసి, రాక్షసానందం పొందిన సంవత్సరం 2012వ సంవత్సరం. మానభంగాలూ, కిడ్నాపులూ, అత్యాచారములూ, హత్యాచారములు, ప్రేమగీమా అంటూ ప్రియాత్మక హత్యలూ, యాసిడ్ పోతలూ, సామూహిక అత్యాచారములూ, భ్రూణహత్యలూ, శిశుజననం జరిగిన క్షణంలోనే చెత్తకుప్ప లోనో, కాలువ, బావుల్లోనో అరటిపండు తొక్కను విసిరేసినట్టు విసిరేయడం, పరికిణీ ఓణీలను, చీరారవికలను విడిచి అర్ధశరీరం బహిర్గతం అయ్యేట్టు, ఫాషన్‌గా జట్టు కత్తిరించుకొని, దెయ్యంలా కేశాలను విరబూసుకునే తిరిగే మహిళలూ, ప్రేమ ప్రేమంటూ పిచ్చికుక్కల్లా వెంటపడే యువతతో కామకేళీలు, ప్రేమ వివాహమంటూ పెద్దలను ధిక్కరించి పెళ్ళి చేసుకుని, మోజుతీరినతోడనే హత్య కావింపబడడమూ ఈ సంవత్సరంలోనే జరిగింది. ఘోరాతి ఘోరాలతో 2012 వెడుతూ ప్రళయానికి నాంది పలికింది. ●

Beautiful City - Beautiful Hotel
DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

(4వ పేజీ తరువాయి)

చేసుకొని దాన్ని అధిరోహించాడు. వేటాడి చంపిన మృగాన్ని చెట్టుకు వ్రేలాడదీశాడు.

ఆకలిదప్పులచే పరితపిస్తూ, ఆ రాత్రంతా నిద్రపోక, తిండిలేక, పడిగాపులు పడుతూ తన రాక కోసం ఎదురుచూసే భార్యాబిడ్డలను తలచుకొని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. దానితో ఏమీతోచక ఆకుల్ని త్రుంచి క్రింద పడేస్తూ ఉన్నాడు. యాదృచ్ఛికంగా పత్రాలు చెట్టుక్రింద వున్న శివలింగంపై పడడం, కన్నీరు అభిషేక జలంగానూ వరలింది. అతను స్వస్థలం చేరుకుని, కాలాంతరంలో అతడు మరణించాక అతని ఆత్మ శివసాయుజ్యం పొందింది.

సూరపద్ముడే రాక్షసుని వేధింపులు భరింపలేక ఆ రాక్షస సంహారం చేయమని దేవతలు పరమశివుని వేడుకొనగా, ఆయన తెరిచిన మూడో కంటి నుండి వెలువడిన శక్తే సుబ్రహ్మణ్యస్వామి అయ్యాడు.

సుబ్రహ్మణ్యస్వామి రాక్షస సంహారం చేసే సందర్భంలో సహకరించినవారే నవయోధులు. వారే వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీరమహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీరమార్తాండ, వీరాంతక, వీరధీర, వీరందరు శివుని పుత్రులే.

పార్వతీదేవి పాదాభరణంలోని విలువైన రాయి రాలి తొమ్మిది ముక్కలవగా, ఆ తొమ్మిది రాళ్ళలో ప్రతిబింబించిన పార్వతి రూపాన్ని శివుడుగాంచగా, ఆ తొమ్మిది మందికి కలిగిన సంతానమే నవయోధులు. రాలిపడి ముక్కలయిన ఆ తొమ్మిదే నవరత్నాలు. నవరత్నాల్లాంటి మగువలకు, శివునికి జన్మించినందువల్లనే వారు శక్తివంతులయ్యారు.

తలనుండి కాలిబొటనలివరకూ సమానంగా అంటే నిలువుగా చెరిసగంగా ఉన్న మగ, ఆడ రూపాలు ఒకటిగా ఉండడం. అర్ధ (సగమైన), నారీ (స్త్రీ), ఈశ్వర (సగమైన పురుషుడు), రూపం (కలిసివున్న రూపం) అవుతుంది. తల ఆలోచనకి, పాదం ఆచరణకి సంకేతాలైతే, పార్వతీ పరమేశ్వరులు తలనుండి కాలివరకూ సమంగా, నిలువుగా ఉంటారంటే, ఇద్దరి ఆలోచనలూ, ఆచరణలూ ఒక్కటే అన్న అర్థం వస్తుంది. లింగరూపంగా ఉండే శంకరుడు పంచభూతాలకీ ప్రతీకగా ఐదుచోట్ల లింగాకారంలో ఉన్నాడు. పృథివీ భూతలానికి సంబంధించిన పార్థివ లింగం కంచిలో, జలానికి సంబంధించిన అప్ లింగం జంబుకేశ్వరంలో, తేజస్సుకి సంబంధించిన తేజోలింగం తిరువణ్ణామలైలో, వాయులింగం శ్రీకాళహస్తిలో, ఆకాశలింగం చిదంబరంలోనూ ఉన్నాయి.

## శంకరునికి ఇష్టమైనవి

పత్రాల్లో మారేడాకు, పుష్పాల్లో జిల్లేడు, మల్లి, తుమ్మిపూలు, పాలల్లో ఆవుపాలు, జలాల్లో గంగాజలం, జపమాలల్లో రుద్రాక్షలు లేదా స్ఫటికాలు, ఫలాల్లో కొబ్బరి కాయ, శరీర లేపనాల్లో తెల్లని భస్మం, లోహాల్లో బంగారం, క్షేత్రాల్లో వారణాశి, మాసాల్లో కార్తీకం, పక్షాల్లో బహుళం, తిథుల్లో చతుర్దశి, వారాల్లో సోమవారం, పర్వతాల్లో హిమాలయం, పండుగల్లో మహాశివరాత్రి, వృత్తుల్లో భిక్షాటనం ఆయనకి మహా ప్రీతికరమైనవి. అందరికీ శివానుగ్రహం ఉండాలని నా ప్రార్థన. ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*
HOTEL MAYURA
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"

# ఛమక్ ఛమక్‌ల తెలుగు! కిటుకు చిటుకే లెరిగిన కవులు!

తెలుగంటే వెలుగరా– అది కోటి సూర్యుల వెలుగురా! మాధుర్యాక్షఱమును బాపగ శక్తి నీకెక్కడిదిరా! ఉక్తి, యుక్తి, ఉనికలకు ఆనాటి కవులె బాటలు వేసిరిరా! బీటలు దీయగలవేమోగాని 'భాష' ఉన్నతిని బాపలేవురా– అని వ్రాసిన అరవై ఏండ్ల క్రితం వ్రాసిన మాటలు వర్తమాన కాలంలో జ్ఞాపకం వస్తున్నది.

తెలుగు కవులలోని వాక్శక్తి అపారము. వాణియే వారి నాలుకపై కూర్చుని, వారి వారి పదాలను వారిపోస్తుంది. తక్కువచేసి మాట్లాడిన వారి మాటలకు అడ్డకట్ట వేస్తుంది. శరణు శరణుయని అరిపింపచేస్తుంది.

వేముల వాడ కవి ఓ గొప్ప తెలుగు మహా కవి, ఓ గొప్ప వారింటి పెళ్ళి భోజనానికి వెళ్ళాడు. ఆ పెళ్ళి పెద్ద స్నేహితులతో పెళ్ళి భోజనానికి వచ్చిన భీమకవిని చిన్నబుచ్చి వెళ్ళగొట్టాడు. పండితుణ్ణి నిరాదరించడం, తగదని అక్కడవారు చెప్పిననూ, ఆ పెద్ద వినలేదు, మరింతగా రెచ్చిపోయాడు.

భీమకవి ఉగ్రరూపం దాల్చాడు. బయటకు వచ్చి అరుగు మీద కూర్చుని,

**గొప్పలు చెప్పుకొంచు నను కూటికి పంక్తికి రాకటంచునీ**
**త్రిప్పడు బాపలందను దిట్టిరి కావున నొక్క మాటునీ**
**యప్పములన్నియు కప్పలయి, యన్నము సున్నముగా మారుచున్**
**పప్పులను శాకముల్ పులుసు పచ్చడులు చిరుబాలుగావుతన్!**

– అని పద్యాన్ని పూరీ పూరించగానే, భోజనానికి కూర్చున్నవారి విస్తళ్ళలోని అప్పాలన్నీ, కప్పలుగ మారిపోయాయి. అన్నము సున్నమై పోయింది. కూరలు మొదలగు వడ్డించిన వడ్డించబోయే వంట లన్నీ తినడానికి కూర్చున్నవారూ, పెళ్ళి పెద్దా భీతిల్లి పోయారు. అప్పుడా పెళ్ళి పెద్ద సిద్ధాన్నం సుద్దానం కావడంతో భీమకవిని శరణు వేడగా, కవి ప్రసన్నుడై మరో పద్యం చెప్పి, అప్పడములు, అన్నము, కూరలు, పచ్చడులు, పులుసులన్నిటినీ యధారూపము చెంది, అందరూ భుజించేట్టు చేసాడు.



కవులూ, రచయితలూ, పండితులూ కళా స్వరూపులు. దైవదత్తమైనది పాండిత్యం. వారిని అవమానిస్తే ఆ దైవం మిన్న కుండదు సరికదా, మిన్ను విరిచి వెన్నుపై పడేస్తుంది.

ఇలాటిదే విదుర నీతిలో వ్యంగ్యంగా కనిపిస్తుంది. కానీ ఈ పద్యార్థంలో కల పరమార్థాన్ని గ్రహించండి.

**ఒకటిగొని, రెండు నిశ్చలయుక్తి జేర్చి**
**మూటి, నాల్గింటి, కడువశ్యములుగ జేసి,**
**ఐదిటిని గెల్చి, యాటిటి నెరింగి, యేడు**
**విడిచి వర్తించువాడు, వివేకధనుడు!**

–బుద్ధి అనే ఒక దానిని గ్రహించి, ఏ పనిని చేయవలెనో, చేయరాదనో రెండు విధములుగ ఆలోచించి, పగవారు, తనవారు మధ్యరకపువారు– అను మూడు తెరగుల మనుష్యులను, సామ, దాన, భేద దండన అనే నాలుగు ఉపాయ మార్గములుగా వశపరచుకుంటూ పంచేంద్రియములను జయించాలి. అటుపిమ్మట సంధి, విగ్రహము, యానం, ఆసనం, ద్వైదీభావం, ఆశ్రమం అను ఆరు విషయాలను తెలుసుకుని, వ్యవహరించాలి. స్త్రీ, వేట, జూదం, పానం, పరుషము లాడడం, కఠినంగా శిక్షించడం, ధనాన్ని వృధాగా ఖర్చుపెట్టడడం– అనే ఏడు (సప్త) వ్యసనాల జోలికి పోకుండడమే వివేక ధనుని లక్షణం– అంటూ గోప్యంగా, గోముగా చెప్పాడు.

పూర్వ గ్రంధాలుగానీ, పూర్వ ప్రాంతాలవారు గానీ– ధర్మనిష్టా గరిష్ఠతకే ప్రాధాన్యతనిచ్చారు. భరతభువిలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో నీత్యుపదేశకర్తలే పల్లె పల్లెనా, గ్రామ గ్రామానా ఉండేవారు. వారి బోధలు చిన్న చిన్న మాటలతో జనపదాలకు అవగాహనమయ్యేట్టు, ఆనందింపచేసేట్టుండేవి. తత్వరహస్యాలనుచ రసవంతంగా నీతివంతమనే తొడుగును తొడిగి తనువును పులకరింపచేసారు. తెలుగు బాస(ష) మాండలిక యాసలతో మురిపెములొలింకించేది.

ఉదాహరణకు: 'హరిహరియని అనరా, హరి హరియంటే నీ పాపములన్నిటి హరియించునురా! హరి హరాదులు నిను సతతము బ్రోతురురా! సన్మార్గమున నడుపుదురురా!' ఎంత చక్కని చిక్కని చిమ్మిలి వంటి పదములండీ! సినిమా వాళ్ళు కూడా, చిత్రాలలో మాయాలోకము తమ్ముడూ! నీ మదిలో సదాశివుణ్ణి మరువకు తమ్ముడూ' అనీ 'కల్లుమానండోయి బాబూ, కళ్ళు తెరవండీ; ఇల్లు వళ్ళూ గుల్ల చేసే కల్లు మానండీ' అనే బోధనను కీర్తన రూపంలో చిత్రణ చేసేవారు. (ఈ మధ్య ఏదో దినపత్రికలో చంద్రబాబు నాయుడు గారు కుండనుంచీ కల్లు పోస్తూ, దోసెళ్ళతో తాగించిన విడ్డూరం చూసాను). రాజకీయ సంస్కృతీ ఈ విధంగా చట్టుపడిపోయింది. వేద భూమి వేదనల భూమిగా మారింది). జానపద సాహిత్యంగానీ, గ్రంధ సాహి త్యంగానీ భక్తి, నీతిపరంగానే మొలకెత్తిన ఘన సాహిత్యం తెలుగు సాహిత్యం. అందుకే ఆది కావ్యంగా 'మహాభారతం' గ్రంధాన్ని గౌరవించారు. తెలుగు అజరామరంగా, విరాజమానంగా విభ్ర జిల్లుతూన్నదంటే భాషలోని గొప్పతనమే. వేదపరమైన బీజాక్షరం 'ఓం' నుంచే తెలుగు భాష వెలుగు పుంతయై, కార్తీక పున్నమి చంద్రికల్లా, అందంగా హాయిగా, ఆనందంగా స్వరబద్ధంగా పలికే సామ వేదంలా స్వరసురళిని, ఉచ్చారణను తెలుగేతరులు సహితమూ జూచి ముచ్చటిల్లుతున్నారు. రాజులు, చక్రవర్తులు, పాదుషాలు, తెల్లదొరలు బంగరు పళ్ళెములతో హారతులొసగారు. తెలుగు కళలకు పర వశించి మాన్యాలిచ్చారు. భాగవతులకు అగ్రహారము లిచ్చారు. పరమార్థ విషయాలను చెబుతూ బుద్ధి రూపేణా నిత్య సత్యాలు నిర్ణయించి కామ, క్రోధ, లోభాలను మూడింటినీ, శమ, దయ, ఉపద, శ్రద్ధ నాల్గింటినీ వశపరచుకుని పంచేంద్రియాలను అదుపున ఉంచుకుంటూ ముమ్ముందు కలిగే ఆకలి, దప్పిక, దుఃఖం, గాఢం, మోహం, ముదిమి, మృత్యువుల వలన కలిగే ఆరు ప్రమాదాలను ధైర్యం పుంజుకుని భగవత్కృపతో భరించే శక్తి కలిగి ఉండాలన్నారు. అప్పుడే మనుజుడు వివేకధనుడు కాగలడు. ●


*Compliments from*

**Sri Krishna Bhat**

**When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala**

**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504


**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

ఏ ప్రఫుల్ల సమయమున నా ఉల్లము ఝల్‌ఝల్ అని పులకరిస్తూ ఉప్పొంగినదో గానీ, ప్రతీ జనవరి 19 గాడ్‌గారి పుట్టిన రోజును నా పుట్టినరోజు పండుగనే సంబరపడతాను. ఎక్కడ ఉన్నా, ఏ నిద్రావస్థలో ఉన్నా, ఏ లేవలేని స్థితిలో నున్నా ఆ రోజు 'గాడ్ బావగారూ' అని పలవరించి, పరవశించిపోతాను. నేనొక్కడినే కాదు, ఎందరో ఎందరెందరో! ఆకాశంలోని నక్షత్రాలన్నా లెఖ్ఖపెట్టవచ్చును కానీ, ఆయన ప్రేమ చూపేవారినీ కానీ, ఆయన్ను ఆరాధించేవారిని కానీ లెక్కలు కట్టలేము!

ఆయన ఎంతదూరంలో ఉన్నవారిని కూడా దగ్గర చేసుకొనే ఆత్మీయ స్వభావం ఆయనకే స్వంతం. ఆడంబరం లేని ఆప్యాయత. అంతులేని వాత్సల్యం వారి స్వంతం. అమ్మాయి, చెల్లీ, తమ్ముడూ, బావగారూ అనే తియ్యటి పిలుపులు తక్క విజయదుర్గా పీఠాధిపతిననే దర్పం ఇసుమంతయినా కనిపించదు. ఇవ్వడమే తప్ప పుచ్చుకోవడం లేని పుణ్యశీలి, పుణ్యస్థలి వెదురుపాక.


విజయా దుర్గాదేవి ప్రత్యక్షమై ఆయన నాలుకపై మంత్రాక్షరములు వ్రాసినప్పటి నుండీ, ఆయన ఐహిక సుఖాలకు దూరమయ్యారు. 'జిల్లెల మూడి 'అమ్మ'లాఅమ్మతనమూ కమ్మతనమూ ఆయనవద్దనే చూడాలి. విశాల భువనంలాంటి ఆయన భవనం 'అందరి ఇల్లు' వంటిది. నిత్యహోమాలూ, యాగాలే గాకుండా, వచ్చినవారిచే అమ్మవారికి కుంకుమ పూజ చేసే అవకాశం అక్కడ ఉంది. నిత్యమూ అన్న సమారాధన జరుగుతూనే ఉంటుంది. ఎవరి కష్టమూ చూడలేని సౌజన్యం వెదురుపాక గాడ్ గారి స్వంతం. ప్రతీ వత్సరమూ జనవరిలో వచ్చే సంక్రాంతి 3 రోజులే కాదు, ఐదురోజులు వెదురుపాకలో జరుగుతుంది.

ఆప్యాయంగా బావగారూ! అంటూ నూతన వస్త్రములిచ్చి, ఆయన కెదురుగా కూర్చునే అదృష్టం అక్కడే పొందాను. నాచే 'అధ్యాత్మ రామాయణం' వ్రాయించిన ఘనత ఆయనదే. ధర్మాధికారి వాడ్రేవు బాపిరాజు గారికి వెదురుపాక క్షేత్రపావనమూర్తి 'గాడ్' గారికివే నా వందనములు. ●




# అనుబంధాల అక్షరమాలిక
## కరిగిపోతున్న కుల వృత్తులపై కన్నీరు

నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి తన ఇంటికొచ్చి బంధువునని పరిచయం చేసుకున్నప్పటికీ దీనికి మూలం ఎక్కడనేది తెలియలేదు. అప్పుడే ఆయనకు ఓ ఆలోచన వచ్చి వంశవృక్షం రచనకు పూనుకున్నారు. దేవతలకు, రాజులకు మాత్రమే సాధ్యమయ్యే ఈ పనిని ఎంతో పట్టుదలతో పరిశోధించి ఏడు తరాల వారసులను గుర్తించారు. మనువడు, కొడుకు, తను, తండ్రి, తాత, ముత్తాత, ముత్తాత తండ్రి వంటివారి బంధువుల శాఖోపశాఖాలను పుస్తక రూపంలో పొందు పరిచారు. ఎవరికి వారు ఏవిధంగా బంధువులవుతారో తెలుసుకోవడం వల్ల దూరంగా ఉన్నప్పటికీ ఉమ్మడి కుటుంబాల మాధుర్యాన్ని పంచుకోవడానికి వీలవుతుం దన్నారు. పూర్వీకుల చరిత్ర తెలుసుకోవడం వల్ల మన భవిష్యత్తు తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఇది నేటి తరానికి మేలు చేకూర్చే విధంగా ఉంటుంద న్నారు. కులవృత్తులు నవీన ప్రపంచంలో నలిగిపోతున్నందున చేతి వృత్తులకు ప్రభుత్వం చేయూతనందిస్తే అవి బంగారంలా పది కాలాలు ఉంటాయని తన భావాలను వెల్లడించారు. ●


శ్రీధీరాల వెంకటాచారి

# నారాయణచెట్టికి నూటారు వయసు! - నిండు నూట ఇరవై ఏళ్ళూ పూర్తిచేస్తారు!

ఆర్యవైశ్యుల్లో తొలి ఐ.ఏ.ఎస్ అధికారి. హిందూ దేవాదాయ ధర్మాధికార శాఖాధిగారి (ఎండోమెంటు కమీషనర్)గా పనిచేసి, ఆ శాఖాభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేసారు. దేవాదాయ శాఖలో అనేక మార్గదర్శక సూత్రాలనూ, మార్గదర్శనం చేశారు. ఆలయాల దర్శనానికి వెళ్ళినప్పుడు సేవా దర్శన పత్ర రుసుము చెల్లింపకుండా వెళ్ళేవారు కాదు. ఆయన కుటుంబ సభ్యులు కూడా రుసుము చెల్లించి వెళ్ళవలసినదే. పై అధికారులూ, కొందరధికారులు కూడా గెల్లి నారాయనచెట్టి వస్తున్నారంటే, వెంటనే లేచి నిలబడేవారు.



ఆయనకు దైవానుగ్రహం అత్యేకంగా ఉంది కాబట్టే భగవంతుడు 'నీవు నిండు నూరేండ్లు కాదు, నూట ఇరవై యేండ్లు ఆరోగ్యంతో జీవిస్తూ, నీ కాళ్ళపైననే నీవు నిలబడి రెండు షష్టాబ్దములు జరుపుకోవాలి గెల్లి నారాయణ శ్రేష్ఠ' అన్నట్టు నా కలం తలపింపచేసింది. పూర్ణపురుషారోగ్యమస్తు!


*If you want Comfortable Stay-*
*Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# దేశప్రజలందరూ మాతృభాషలోనే విద్యాభ్యాసం చేసిననాడు విజ్ఞానవంతులయే అవకాశం ఉన్నది.



**భా**వసామరస్యం, తమ భావాలను స్వేచ్ఛగా, స్వచ్ఛంగా, సత్యంగా, ధర్మంగా, సాంప్రదాయపరంగా, సారస్వ హృదయం కలిగే జీవన సరళిని మాతృభాష నేర్పుతుంది.

దేశీయమైన కళలు, వృత్తులు, సాంప్రదాయములు వంటబట్టడానికి, సత్ప్రవర్తన గల వారిగా తీర్చిదిద్దడానికి మన దేశీయ భాషలు స్వచ్ఛమైన నీతి విశారదలుగా తీర్చిదిద్దే పరిజ్ఞానాన్ని, మన పూర్వులు సిద్ధాంతీకరించి, క్రమ ప్రణాళికను (సిలబస్) తయారించి మార్గదర్శనం చేసారు. బిడ్డ పుట్టినప్పట్నుంచీ తల్లిపాలునే యివ్వమన్నారు. ఆరోగ్యంగా పెరగాలంటే తల్లిపాలే బలిష్టుణ్ణి కావిస్తాయ్. తల్లిపాలవంటిదే తల్లిభాష. పోతపాలును పోసే తల్లులు పెరిగిన తరువాత, కుత్రిమ పాలను త్రావి, పిల్లవాడు మన తల్లి భాషా మాధుర్యాన్ని రుచి చూడలేకపోతున్నాడు. పిన్నతనంలోనే 'యా' (యస్‌కు పర్యాయపదం) అంటూండే అంటు రోగానికి మనం కారకులం కాకూడదన్నది విశ్వకవి రవీంద్రుని అభిప్రాయం. 1897 సం॥ములోనే 'నాటోర్'లో జరిగిన రాష్ట్రీయ మహాసభలో కార్యక్రమ వ్యవహారములన్నిటినీ మాతృభాషయైన బెంగాలీ భాషలోనే జరిపించి అందరికీ అవగాహనమయ్యేట్లు చేసారు. రెండేళ్ళ తరువాత 'ఢాకా'లో (బంగ్లాదేశ్)లో జరిగిన రెండవ రాష్ట్రీయ సభలో కూడా రెవరెండ్ కాళీచరణ్ బెనర్జీ ఆంగ్లోపన్యాసాన్ని చక్కని ధారణామయమైన బెంగాల్ భాషలోని వినిపించి, అందర్నీ అనందింపచేయడంతో, అప్పటి నుంచీ అన్ని సభల్లోనూ 'బెంగాలీ' లోనే మాట్లాడడం ప్రారంభమైంది. నిజానికీ మాతృభాషోద్యం వంగభాషోద్యమంగానే నాందీగీత స్వరమైంది. భాషను కాపాడుకోవడానికి వారెంతో కృషి చేసారంటే రవీంద్ర కవీంద్రుడే కారణం!

ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని జాతీయగీతం, భారతదేశంలోని జాతీయగీతం రవీంద్ర కవీంద్రుని కలం గళముల నుండి ఉద్భవించినవే! భారతదేశపు తొలి నోబుల్ సాహితీ అవార్డు గ్రహీత కవి రవీంద్రుడే! మరల ఎవరూ ఆస్థానానికి రాలేదు.

గాంధీజీ రవీంద్రునికీ ఎన్ని అభిప్రాయ భేదాలున్నప్పటికినీ, పరస్పర గౌరవ మర్యాదలు కొనగాగుతూనే ఉండేవి. గాంధీ తలపెట్టిన సహాయ నిరాకరణోద్యమం హింసాత్మకమవుతుందని రవీందుద్రు ముందుగానే ఊహించి, వలదన్నారు. చరఖా కార్యక్రమాన్ని చర్చిండం కోసం రవీంద్రుని వద్దకు గాంధీజీ వచ్చారు. ఈ విషయంలోనూ రవీంద్రుడు విభేదించారు. కానీ రవీంద్రుడు లండన్ వెళ్ళినపుడు గాంధీ నాయకత్వం ఔన్నత్యాన్ని గొప్పగా ప్రశంసిస్తూ మాట్లాడారు. 1940 సం॥ములో గాంధీజీ శాంతినికేతనానికి వచ్చినప్పుడు– "ఈ శాంతినికేతన్‌కు మీరు సంరక్షునిగా ఉండాలని కోరగా, మీరు స్థాపించిన 'విశ్వభారతి' జాతీయ సంస్థయని నేనెరుగుదును. ఇది అంతర్జాతీయ సంస్థగా విఖ్యాతి నొందుతున్నదని వాస్తవం. ఈ సంస్థను సవ్యంగా నడిపే సమిష్ఠి కృషిలో నేను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వాగ్దానం చేసారు. మీరు నిశ్చింతగా ఉండండి అంటూ బాస చేసారు.

ఒకే గూటిలో విద్యా, వివేక సంపన్నతలు ఆశ్రయం పొందిన విశ్వమే విశ్వభారతి. పూర్వం అడవుల్లో గురుకులం పద్ధతుల్లో విద్యనభ్యసింపచేసిన విధానాన్నే రవీంద్రులు అమలుపరిచారు.

## పరమేశ్వరా!

*భయం లేని మనసు వంచని శిరసు!*
*ఉన్ముక్త జ్ఞానం ఎచట ఉండునో!*
*సంకుచిత భావములతో*
*సమాజమెచ్చట ఛిన్నాభిన్నం కాదో!*
*వాక్కులెచట సత్యపు లోతుల*
*పొరల నుండి వెలువడునో!*
*విరామ మెరుగని కర్మధారలెచట*
*పరిపూర్ణతకై చేతులు చాచునో!*
*వివేకమనెడి నిర్మల ప్రవాహము*
*దురాచారముల మరు భూములలో*
*ఇంకని తావేదో!*
*నీ నేతృత్వంలో మనసు ఎచట*
*సదా క్రమక్రమంగా విస్తరించే*
*ఆలోచనలలో పనులలో*
*నిమగ్నమై యుండునో!*
*అట్టి స్వతంత్ర స్వర్గసీమగా*
*నా దేశం మేలు కొనునుగాక!*

(రవీంద్రుని 'గీతాంజలి'కి పాతూరి నాగభూషణం తెలుగుసేత)


దేవేంద్రనాథ్, శారదాదేవి దంపతులకు 1861 సం॥మే 7వ తేదీన రవీంద్రుడు జన్మించాడు. తండ్రి దేవేంద్రనాథ్ తరచు హిమాలయాలకు వెడుతూండేవాడు. చిన్నప్పట్నుంచీ ఆయనిది చక్కని స్వరపేటిక. తండ్రి అబ్బురపడి చక్కని పాటలు పాడించుకుంటూ సంకీర్తనంతో దైవప్రార్థనం చేయించేవాడు. తండ్రి తీరిక వేళల్ని చూచి సంస్కృతం, ఖగోళశాస్త్రం అభ్యసించారు. రవీంద్రుని రచనల్లో సంస్కృతం పాలు ఎక్కువగా కనిపిస్తుంది. చిన్నతనంలోనే కవిత్వం, సంగీతం అలవడింది. పదహారేండ్ల ప్రాయంలో నాటకాల్లో కూడా నటించేవారు. ఐరిష్, ఇంగ్లీషు పాటల్ని కూడా నేర్చుకుని స్వరపరిచేవారు. 'వందే మాతరమ్' గీతానికి కూడా ఆయన స్వరకల్పన చేసారు. అపారమైన దేశభక్తి కల సత్యకాలపు మనిషి. ఆయన రచించిన 'గీతాంజలి' కావ్యానికే ప్రపంచ మెచ్చుకోలు, నోబుల్ బహుమతి లభించింది. సాహిత్యంలో నోబుల్ బహుమతి లభించిన భారత తొలి, మలి సాహితీ వేత్త రవీంద్రులే.


1883 సం॥ములో రవీంద్రునికి మృణాలినీ దేవితో వివాహం జరిగింది. వారిది అనుకూల దాంపత్యం. ఆ అనుకూలత రెండు దశాబ్దాలు కూడా పూర్తి కాకుండానే 1902 సం॥ము నవంబరు 13వ తేదీన మృణాలినీ దేవి కన్నుమూసారు. రవీంద్రుని వైవాహిక జీవితంలో అదొక పెద్ద దెబ్బ. ఆయన ఎనలేని దుఃఖాన్ని పొందారు.

తరువాత దేశీయ ప్రేమ, జాతీయ భావ చైతన్యం, విశ్వభారతి స్థాపనం, దాని అభివృద్ధి కొరకూ అహ

(తరువాయి 9వ పేజీలో)

# రవీంద్రుడు జన్మించిన ఇంటినే మ్యూజియమ్ చేసారు






విశ్వకవి వాడిన కారు

'విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ కోల్‌కత్తాలోని జోరనంఖో ప్రాంతంలో జన్మించారు. అక్కడ చాలా కాలం ఉన్నారు.


రవీంద్రసరణి రోడ్డులోని ఆర్చిని దాటుకుని వెళ్తే రాచదర్పం ఉట్టిపడే నిలువెత్తు భవనం కనిపిస్తుంది. అదే రవీంద్రుడి నివాసం... ఆనాటి దేశ ఆర్థిక, సాంఘీక, సాంస్కృతిక, రాజకీయ సమాలోచన లకు సజీవసాక్ష్యం. మహాత్మాగాంధీ వంటి వారంతా ఇక్కడికి వచ్చి క్విట్ ఇండియా, వందేమాతరం ఉద్యమాలకు వ్యూహాలను రచించేవారు. రవీంద్రుడి జ్ఞాపకాలతో పాటు నాటి బ్రిటిష్‌కాలంనాటి పరిణామ క్రమాలన్నింటినీ మౌనంగా వీక్షించిన ఈ భవనాన్ని ప్రధాని పండిట్ జవహర్‌లాల్ 1961లో ప్రజల సందర్శనార్థం మ్యూజియంగా మార్చారు.

30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనం. జాతీయ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. రవీంద్రుడి స్మృతిచిహ్నాలుగా నిలిచిన ఎన్నో వస్తువులు, చిత్రాలు, రచనలు, పత్రాలు, ప్రచురణలను ఇక్కడ ఉన్నాయ్. టాగోర్ రచనల్లోని చక్కని పరిచయవాక్యాలు, ఫోటోలు భవనం గోడలమీద కనిపిస్తాయి. టాగోర్ తండ్రి మహర్షి దేవేంద్రనాథ్ టాగోర్‌కు గుర్తుగా మహర్షిభవన్ అనే పేరు దీనికి పెట్టారు. చివరి రోజుల్లో రవీంద్రుడి జీవితాన్ని పై అంతస్తులోని ఓ గదిలో టాగోర్ సతీమణి మృణాళినీదేవికి చెందిన దావాన్, పుస్తకాలు, ఫొటోలు, చెక్క అరలు, కుర్చీలు, వెండి సామాన్లు, తమలపాకులు దాచుకునే పెట్టెవంటివన్నీ ఉన్నాయి. మరణించేవరకూ ఆమె ఆ గదిలోనే ఉండేవారట. గురుదేవ్ గీసిన పెయింటింగ్‌లో ఆమెను చూడగలం. దీనికి పక్కనే టాగోర్‌కు చెందిన స్టడీరూం, అతిథులకోసం ఏర్పాటుచేసిన గెస్ట్‌రూం ఉన్నాయి. బయట వరండాలో గురుదేవుడి రచనలకు సంబంధించిన షోకేస్ ఉంది. ఇందులోనే టాగోర్ వంశ వృక్షాన్ని తెలిపే పట్టికను అమర్చారు.ఆయన ధరించిన దుస్తులు, పొడవు చేతుల కోట్లు, టోపీ, చెప్పులు... వంటి వాటిని గదిలో భద్రపరిచారు.

అక్కడ నుంచి పై అంతస్తులోకి వెళితే సాంస్కృతిక వికాసానికి టాగోర్ చేసిన కృషికి సంబంధించిన ఫోటోలు, రాజారామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బంకించంద్ర చటోపాధ్యాయ, వివేకానంద... వంటి ప్రముఖులల చిత్రపటాలు కనిపిస్తాయి. ఇక్కడే రవీంద్రుడి తాతగారైన ద్వారకనాథ్ టాగోర్, తండ్రి మహర్షి దేవేంద్రనాథ్‌టాగోర్, ఇంకాసమీప బంధువులకు చెందిన విలువైన వస్తువులను ప్రదర్శనకు ఉంచారు.

ఈ భవంతిలోనే కుటుంబంలోని మహిళలు ప్రసవించేం దుకు ప్రత్యేకంగా నిర్మించిన ఓ గది వుంది. అందులోనే టాగోర్ 1861 మే 7 వతేదీన జన్మించారు. అయితే బెంగాల్‌లో మాత్రం ఆ తేదీతో సంబంధం లేకుండా వైశాఖ మాసం 25వ రోజున ఆయన జన్మదినోత్సవం జరుపుతారు. వంటగదిలో మట్టిపొయ్యి, పింగాణీపాత్రలు, భోజనం చేయడానికి వీలుగా వెదురుతో అల్లినబల్ల, అద్దాల బీరువాలు ఉన్నాయి.

మహర్షిభవన్‌కు పక్కనే విచిత్రహాల్ ఉంది. టాగోర్ రచించిన డాక్‌ఘర్ (పోస్టాఫీసు) నాటకాన్ని 1917లో ప్రదర్శించిందిక్కడే, ఆయన ఎప్పుడూ ప్రయాణించే కారు కూడా ఆవరణలోనే ఉంచారు. పచ్చని చెట్ల మధ్యలో అలరారే ఈ ప్రాచీన భవంతిని సందర్శిస్తే ఆనాటి రవీంద్రుడి జీవితంలోని ఎన్నో విశేషాలను ప్రత్యక్షంగా చూసినట్లే అనిపిస్తుంది. ●



(8వ పేజీ తరువాయి) రహమూ శ్రమించడమే ఆయన దినచర్యలయ్యాయి. సంగీత, సాహిత్యాలే ఆయనకు శ్వాసగా నిలిచాయ్.

## -నూరేండ్లు వర్ధిల్లాలి అన్నారు గాంధీజీ!-

రవీంద్రుని 80వ జన్మదిన సందర్భంగా, గాంధీజీ వచ్చి- మీరు నిండు నూరేండ్లు జీవించాలి' అంటూ అభినందించారు. రవీంద్రులు గాంధీజీకి కృతజ్ఞతలు చెబుతూ, ఎనిమిది పదుల వయసే క్లేశదాయకంగా ఉన్నది. నూరేళ్ళనసలే భరించలేను అన్నారు. ఏ తథాస్తు దేవతలుండే సమయంలో రవీంద్రుడన్నారో కాని, అటు పిదప కొన్నాళ్ళకే 1941 సం॥ ఆగస్టు 7వ తేదీ శ్రావణ మాసపు 'రాఖీ' పండుగ రోజున రాఖీ కట్టించుకోకుండానే దేహాన్ని చాలించారు. స్వాతంత్రోదయం కూడ చూడని భానుదాయన. ●

# వివేకానందవాణి



ఎంతకాలం జీవించినా, మనిషికి బ్రతుకుమీది తీపిపోదు. ఇంకా ఇంకా బ్రతకాలనిపిస్తుంది. ఎంత ఆలోచించినా, జీవితం చిత్ర విచిత్రంగానే ఉంటుంది. ఏ శూన్యం నుంచీ వచ్చామో ఆ శూన్యం లోకి పోవక తప్పదు.

నిశీధిని ధిక్కరించడం, ఎదిరించడం క్షంతవ్యం కాదు. కాల ధర్మాన్ని కాల రాయడం అనేది పెద్ద అధర్మం. ఒకసారి గతం, మరోసారి వర్తమానం, అగుపించని భవిష్యత్తు ఒకదాని తరువాత ఒకటి వెంటాడి వేదిస్తుంటుంది.

అంతరంగంలో అఖండంగా ప్రకాశించే వెలుగునాసరాగా చేసుకుని చీకటి అఖాతంలోకి చొరబడుతున్నావని అనుకోవలదు.

శ్రద్ధాభావంతో, ధైర్యంగా ముందుకడుగువేయ్! ఎంత చిన్నపనైనా పెద్ద పనైనా సవ్యంగా చెయ్. మహాద్భుత ఫలితాన్ని పొందగలవు. కోరికలను అదుపుచేసి, ఉన్నతలక్ష్యాలనందుకోవాలి. పవిత్రత లోపించిన కార్యం అప్రియం, అపవిత్రం. ఎవ్వరు ప్రతిఫలాన్ని ఆశించరో, ఎవ్వరు స్వార్థరహితంగా, సమాజహితంగా కార్యాలు చేస్తారో వారు విజయం సాధిస్తారు.

గొప్ప కార్యాలెపుడూ తేలికగా సాధించబడవు. ఎక్కువ సంకల్పం, వజ్రం లాటి హృదయం, ఎలాటి పరిస్థితుల్లోనూ చలింపనివారు పదిమంది ఉంటే ఈ దేశం నందనవనమే! ●

-ఆంధ్రుడమ్మా! ఆంధ్రుడు! అందుకే ఢిల్లీలో స్మారక చిహ్నం లేకుండా చేసారు!! -

# భారత రాజ్యాంగ విలువల్నీ, ఆర్థికవనరుల్నీ పునరుద్ధరింపచేసిన భారత [రత్నం] ప్రధాని పి.వి.నరసింహారావు!

## ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీలకు రాజకీయ సలహాలిచ్చిన చాణుక్యుడు! అతడేనమ్మా! అతడే!!




సోనియాకు సలహాలిస్తూ...

ఇందిరాగాంధీ కుటుంబం పట్ల ఎంతో విధేయంగా ఉండడమేగాకుండా, ఇందిరకు, ఇందిర మరణం తరువాత రాజీవ్‌గాంధీకి మంచితోడుగా సలహాదారుగా ఉన్నవాడు, మన తెలుగు బిడ్డ పి.వి.నరసింహారావు. సాహితీ వేత్తగా, రాజకీయవేత్తగా, కేంద్రంలో మానవవనరుల మంత్రిగా పనిచేసి, అజాత శత్రువునే పేరు తెచ్చుకున్న మహనీయుడు పి.వి.నరసింహారావు. పద్నాల్గు దేశ విదేశీ భాషల్లో పండితుడు. రాజకీయ జీవితానికి స్వస్తి పలికి, సాహితీ కృషి చేద్దామనుకుని, రాజకీయాలకు దూరమవుతూ వచ్చాడు. ఇంతలో రాజీవగాంధీ హత్య జరగడంతో తిరిగి సోనియాకు అండగా, ఆమె పిల్లలు ప్రియాంకా, రాహుల్‌లకు ధైర్యవచనములు చెబుతున్న సమయంలో, భారతప్రధానిగ, కాంగ్రెసు అధ్యక్షపదవులు రెండిటి బాధ్యతల్ని వహించవలసిన అవసరం వచ్చింది. ప్రణబ్ ముఖర్జీ తదితర నాయకులు అజాత శత్రువుగా అందరికీ ఆమోద యోగ్యంగా ఉండే మితభాషీ, మృదుభాషీ, బహుభాషీయైన పి.వి.నరసింహారావును ప్రధానిని చేస్తే, దేశ సుస్థిరతకు భంగం రాదని భావించి, బలవంతపరిచి ఒప్పించారు. కారణం రాజీవ్‌గాంధీ హత్యతో, సోనియా తన పిల్లల భద్రత కోసం దూరంగా ఉండాలని భావించడం ఒక కారణం. ప్రియాంక, రాహుల్ లిరువురూ పిన్నవయస్కులు కావడం, అత్త ఇందిర, భర్త రాజీవ్, ప్రధాన మంత్రి పదవిల్లో ఉంటూ దారుణ హత్యలకు గురికావడంతో, సోనియా రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంది.

ప్రధానులుగా పనిచేసినవారు ఒక్క మొరార్జీ తక్క, చంద్రశేఖర్ వంటి వారు భారతదేశంలోని బంగారమును కొదువపెట్టి, దేశ ఆర్థిక స్థితిని తిరోగమనంలోనికి తెచ్చారు. విదేశీ సంబంధాలు కూడా అంత సన్నిహితంగా లేవు.

పి.వి.నరసింహారావు ప్రధాని పదవిని చేబట్టిన వెంటనే చేసిన తొలి మంచి పని మన్మోహన్ సింగును ఆర్థికమంత్రిగా చేసి ఆర్థిక వనరులపై, సంస్కరణలపై దృష్టి పెట్టడం, మన్మోహన్‌కు ఆర్థిక విషయాల్లో సలహాలిస్తూ, స్వతంత్రంగా శాఖను నిర్వహించే శక్తియుక్తులను నేర్పినది పి.వి.యే! మైనార్టీ స్థాయిలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వాన్ని, వచ్చే ఒడిదుడుకులను చాకచక్యంగా పరిష్కరిస్తూ, ఐదు సంవత్సరములు పూర్తిగా నడిపిన చాణుక్యుడు మన పి.వి అనడం మన తెలుగువారికెంతో గర్వకారణమనే చెప్పాలి. అర్జునసింగ్ వంటి వారి నుంచీ సహాయ నిరాకరణం ఎదురవుతున్ననూ, గణనీయంగాపూర్తికాలం పదవిని నిర్వహించి, అమెరికావంటి దేశాల ప్రశంసలు పొందిన ప్రధాని ఎవరంటే పి.వి.యనే పాశ్చాత్యులు ఇప్పటికీ ప్రస్తుతిస్తారు. ●

# అప్పాజోస్యుల, విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్! -స్వార్జితం నుంచే సాహితీ పురస్కారాలు!!



నిరాడంబర కార్యకర్త

అమెరికాలోని 'తానా', 'ఆటా' చేయని, చేయలేని రొఖ్ఖ పురస్కారాలను అజోవిభోకందాళం (అప్పాజోస్యుల, విష్ణుభొట్ల, కందాళం) ఫౌండేషన్ చేస్తూన్నది.

వీరు ముగ్గురూ అమెరికాలో ఉద్యోగం చేసుకుంటూ, నెలసరి జీతంలోని కొంతమొత్తాన్ని సాహితీ కార్యక్రమాలకూ సాహితీ పురస్కారాలకు కేటాయించి, వర్షవర్షమూ తమ హర్షాన్ని ప్రకటిస్తూ, ప్రోత్సహించడం ఓ గొప్ప, మహత్తరమైన కార్యక్రమం. అన్యులకు సాధ్యం కాని అనూహ్య, అనన్య కార్యక్రమాల్ని వారు మాతృదేశమైన ఆంధ్రదేశం వచ్చి చేస్తున్నారు.

ఆడంబర మనుష్యులు కాదు, ఆడంబరాలకు పోరు. అసలు ఆ మనుష్యులను చూస్తున్నప్పుడు వీరింతట, కార్యక్రమాలను చేసే వ్యాపారస్థులా, వ్యాపారంలోని లాభాల్ను ఇలా పంచుతున్నారా? అంటే అదీ కాదు. అమెరికాలో నెలసరి వేతనములు తీసుకునే ఉద్యోగస్థులు. హాయిగా, ఆనందంగా, కులాసాగా తమ డబ్బుతో కులుకుదామనుకున్నవారు కాదు. వీరికేమైనా డబ్బు చేదా, కానే కాదు. మాతృభాషపై తీపిదనం, మాతృసాంప్రదాయంపై తీపిదనం, కళలపై మమకారం. ఎంత మమకారం- అంటే ఇంతా అని చెప్పలేను! కానీ వా-మనునిలా ఒక కాలు అమెరికాలోనూ, మరో కాలు ఆంధ్రదేశం మీదనూ వేస్తూ, సూర్యమండలమంతటి తెలుగు కళాసాహితీ తేజస్సును కురిపింపచేస్తున్నారు.

అమెరికాలో ఉంటున్ననూ, సంవత్సర ప్రారంభంలో ఆంధ్రదేశం రావడం, నాటక పోటీలు జరుపడం, సాహితీవేత్తలను సత్కరించడం- అది కూడా లక్ష రూపాయలకు తక్కువ కాకుండా రొఖ్ఖ సత్కారం యివ్వడం 'అజోవిభో కందాళం' ఫౌండేషన్ విశిష్టత. ఆ సన్మానితుని ప్రతిభను గూర్చి ప్రత్యేక సంచికను తీసుకుని రావడం మరో ప్రశంసించదగిన విశిష్టత.

అప్పా జోస్యుల సత్యనారాయణ గారితో నాకు హిత పరిచయం ఉన్నది. ఆయన సాహిత్యాన్ని ఎంతగా అభిమానిస్తారో, నాటక కళనంతగా ప్రేమిస్తారు. వృత్తిరీత్యా ప్రొఫెసరయినా సహజంగా చక్కని నటుడు. నటులు, సాంప్రదాయ సాహితీ వేత్తలూ ఆయనకు రెండు నేత్రాలు. రాజకీయాలు ఆయనకు పట్టవు. తెలుగు భాష, సాంప్రదాయం, కళలకు ఇతోధికంగా ప్రోత్సహించాలనే ఆరాధనా భావం ఎక్కువ. అందునా విశ్వనాథ సత్యనారాయణగారి పేరు చెబితే చాలు ఎంతగా ఆయన మోమూ, మోముపై ఆనందమూ విభ్రాజిల్లుతుందో చెప్పలేను. నేను ప్రత్యక్షంగా చూసాను. విశ్వనాథ వారి 'రామాయణ కల్పవృక్షం' లోని పద్యాలను తలక్రిందులుగా ఒప్పగించమన్నా ఒప్పుగ ఒప్పగిస్తారు. ఎందరో రచయితలు గ్రంథాలను ముద్రించారు. ముద్రణైన యితర ఇతిహాస గ్రంథాలను తెప్పించి అక్కడివారికి అందచేసేవారు. బహుభాషావేత్త, భారతదేశం నేలిన తెలుగు ప్రముఖుడు, నెహ్రూయేతర కుటుంబ వ్యక్తిగా అయిదు సంవత్సరాలు ప్రధానిగా పాలించిన శ్రీ పి.వి.నరసింహారావు వీరి సత్కారాన్ని నమ్రతతో అందుకున్నారంటే అప్పాజోస్యుల ఘనతయేదో తెలియకపోదు. వారి సందర్భంలో ప్రచురించిన పి.వి. ప్రత్యేక సంచిక ఒక వేయి పడగల గ్రంథమని చెప్పాలి. మరో మంచి పని చేస్తున్నారని విన్నాను. చీరాల పేరాలలో ఉన్న అప్పాజోస్యుల వారి గృహాన్ని కల్యాణ మండపంగా మారుస్తున్నారని- కల్యాణప్రదమగు పనులు చేసే సత్యనారాయణ, వారి సహచరులకు మా శుభాశీస్సులు. ●



# బళ్ళారి రాఘవ లోని కళాభిజ్ఞత మరొకరికి అలవడలేదు. విశ్వకవి రవీంద్రుని మన్ననలందిన నటుడు!



"తత్త్వవేత్త, రాజకీయవేత్త, సంఘ సంస్కర్త విద్యాదాయకుడు. వీరందరి ప్రత్యేక గుణములు నటునిలో సమ్మిళితమైనప్పుడే అతడు నిజమైన నటుడు కాగలడు. అంతే కాదు ప్రజానీకంలో మంచి అభిరుచులు నెలకొల్పుట, వారిని కళాభిజ్ఞులను చేయుట, తమలో ఇమిడియున్న దైవికశక్తులను తాము తెలుసుకొనునట్లు చేయుట నటుని విధి. జనులలో కనబడు పశుత్వమును క్రమశిక్షణవలన దైవత్వముగా పరిణామము చెందునట్లు చేయుట కూడా నటుని గొప్ప బాధ్యత. ఈ ఆశయం లేని నటుడు ఎంత ప్రజ్ఞావంతుడైనా నిజమైన నటుడు కాజాలడు. అతడొక బఫూనే" అంటూ కొన్నేళ్ళ క్రితం మద్రాసు రేడియో కేంద్రం నిర్వహించిన గోష్ఠిలో 'నటుడు–నటన' అనే అంశంపై ప్రసంగిస్తూ బళ్ళారి రాఘవ తమ అభిప్రాయాలను నిర్భీతిగా వెలిబుచ్చారు. నటన యొక్క మహోన్నత లక్ష్యాన్ని నిర్వచించిన రాఘవ వ్యక్తిగత జీవితం కూడా మహోదాత్తంగా సాగింది.

రాఘవ మేనల్లుడైన డా॥ ఏ.నాగరాజ్ పేర్కొన్న కొన్ని విషయాలను రాఘవ చివరిరోజులలో వారితో నాకున్న కొద్దిపాటి పరిచయాన్ని పురస్కరించుకొని కొన్ని విశేషాలను తెలుపటమే ఈ నా వ్యాస వుద్దేశం.

రాఘవ ప్రతినిత్యం వేకువనే లేచేవారు. లేచిన వెంటనే కాలెండర్‌లోని తేదీని మార్చటం ఆయన అలవాటు. ఈ అలవాటు వారి జీవితాంతం దాకా సాగింది. రాఘవ మేనకోడలు కుమారి సులోచనతో క్యాలెండర్ లోని తేదీ మార్చుటలో ఆయన పోటీపడేవారు. వేకువనే లేచే అలవాటు బాల్యంలోనే కల్గించాలని ఆయన అభిప్రాయం. ప్రార్థనతో దైనందిక కార్యక్రమం ప్రారంభించి సాహిత్య నాటకకళా గ్రంథాలను అధ్యయనం చేసిన తరువాత తమ న్యాయవాద వృత్తికి సంబంధించిన కార్యక్రమాలకు పూనుకొనేవారు. సాయంకాలం కోర్టు నుంచి రాగానే పండితమిత్రులతో నాటక గోష్ఠి చేసేవారు. సాయంకాలం ఎవరు వచ్చినా కోర్టువిషయాల గురించి మాట్లాడేవారు కాదు.

పండిత్ తారానాథ్‌గారు ఆయన ఆధ్యాత్మిక గురువు. రాయచూరుకు చెందిన శ్రీరామగురు, హంపీగుహలలో సాధన కొనసాగిస్తూ వుండిన శంభరనాథ్‌జీ మున్నగు ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు రాఘవగారి ఇంటికి అప్పుడప్పుడు వచ్చేవారు. వారిగృహం కళాకేంద్రమే కాక ఆధ్యాత్మిక కేంద్రంగా కూడా వుండేది.

రాఘవ మిత్ర సంపద అపారము. వారి ఆప్తులలో కన్నడిగులైన గొప్ప నాటకకర్త టి.పి. కైలాసం డా॥డి.వి.గుండప్ప, గుబ్బి వీరణ్ణ, ఆ.న.కృష్ణారావుగార్లు ప్రముఖులు, డా॥ కట్టమంచి రామలింగారెడ్డి డా॥పి.వి.రాజమన్నార్, బి.యన్.రెడ్డి గూడపల్లి రామబ్రహ్మం శ్రీమతి పద్మజానాయుడు, స్వామి శివశంకరులు మరెందరో మేధావులు వుండేవారు.

తారానాథ్‌గారి ప్రోద్బలంతో రాఘవ స్వగృహంలో ఒక ప్రత్యేక భజనమందిరం వెలసింది. ఆ మందిరంలో హిందూ దేవతల చిత్రాలతో పాటు క్రీస్తు, బుద్ధుని చిత్రాలు కొరాన్ సూక్తులు మున్నగునవి కూడా వుండేవి. ప్రతినిత్యం సాయంకాలం భజన జరుగుచుండేది. ఈ కార్యక్రమంలో స్త్రీలు, పురుషులు, పిల్లలు పాల్గొనేవారు. ఒక హరి జన భక్తుడు చనిపోయేముందు బహూక రించిన ఏకనాదం వాయిస్తూ రాఘవ భజ నలో పాల్గొనేవారు. స్థానికులే కాక విదే శీయులు కూడా ఈ భజన కార్యక్రమంలో పాల్గొనేవారు. సోమవారం సాయంకాలం విభూతి ధరించి రాఘవ భక్తి కీర్తనలను పాడుతూ వుండేవారు. పూనా నుండి ఒక యూరోపియన్ యోగా వచ్చి చాలరోజులు రాఘవతో పాటు వుండి రోజూ భజనలలో పాల్గొని మరాఠీ పాటలు పాడేవారని రాఘవ మేనల్లుడైన ప్రముఖ న్యాయవాది ధర్మవరం వేణు గోపాలాచారి గారు తెలిపారు.

సంప్రదాయ కుటుంబములో పుట్టిన రాఘవ కులమత బేధాలను ఏ మాత్రం పాటించేవారుకాదు. పండుగ రోజుల్లో హరిజనులను ఆహ్వానించి వారితోపాటు భోంచేసేవారు. హరిజన విద్యార్థుల కోసం బళ్ళారిలో స్వంత పైకంతో 'ముద్దుతార' ప్రాథమిక పాఠశాలను స్థాపించారు. ఆయన ఎందరో బీద విద్యార్థులను చేరదీసి ఆర్థికంగా ఆదుకున్నారు.

రాఘవ సాంఘిక సంస్కరణ కృషిని అసహ్యించుకొన్న సనాతనులు రాఘవను శ్రీ వైష్ణవ మతం నుండి వెలివేయించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలకు రాఘవ ఏ మాత్రం జంకలేదు. నిజమైన వైష్ణవునికి కులమతాల పట్టింపు వుండకూడదని ఆయన గట్టిగా విశ్వసించారు. ఆయనను అవహేళన చేసినవారే తుదకు ఆయన మిత్రులయ్యారు.

సాధారణంగా గొప్పవారు తమ చుట్టూ వందిమాగధులను చేరనిస్తారు. ఇట్లా చేయుట మనుషులకుండే బలహీనత. కాని రాఘవ వేరు. సి.ఆర్.రెడ్డి, టి.పి. కైలాసం మంచి స్నేహితులు. డా॥రెడ్డి రాఘవకు ఒక ప్రశ్న వేసినారు. సనక సనందుల చేత శపించబడ్డ వైకుంఠ ద్వారపాలకులను ఉద్దేశించి భగవద్ద్వేషులుగా మూడు జన్మలెత్తుతారా? భగవదభక్తులుగ ఏడు జన్మ లెత్తుతారా? అని విష్ణువు అడిగినాడు కదా! అంటే దైవ విరోధులు దైవ సన్నిధిని త్వరగా చేరుకొంటారనా?" రగ్గి (రాఘవ) ఈ ప్రశ్నను కైలాసం గారికి చేరవేసినారు. ఆయనిచ్చిన సమాధానం ఆయనకు తగినట్టే వుంది. ఒక గీత ప్రక్కనే మరొక గీత గీచినామనుకుందాము. రేఖాగణితంలో వీటిని సమాంతర రేఖలంటారు. ఇవి ఎక్కడా కలుసుకోవు. అనంతమైన దూరంలో కలుసుకొంటాయని ఆ శాస్త్రం చెబుతుంది. ఒక గీతను ఇంకొక గీత సూటిగా, నిటారుగా మొదటి గీతను ఢీకొనాలి. ఇట్టి గీతను లంబరేఖ

SOUTHERN TRAVELS
happy holidaying...
SOUTHERN TRAVELS PVT.LTD.
(Recognised by Ministry of Tourism. Govt. of India) Since 1970
18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 05.
Tel. : 011-4353 2800 (100 Lines), 2875 3466
Fax : 011-2875 7308, 4250 2090
e-mail : info@southerntravels.in
Winners of National Award as "The Best Domestic Tour Operator" 2 Times in a row securing 1st Position in India from the Ministry of Tourisim, Govt. of India
Book online through www.southerntravels.com
Our Tour Packages, Hotels in India & Domestic / Flight Tickets
Chennai : 044-2538 5253 Mumbai : 022 - 2501 0027
Vijayawada : 0866 - 257 6624 Vizag : 0891 - 274 5565
Bangalore : 080 - 2226 2633, Hyderabad : 040 - 2331 8866

క్రొత్త ఢిల్లీలో ఆంధ్రా హోటల్ HOTEL SOUTHERN
ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ
HOTEL SOUTHERN style. comfort. enjoy.
ఆధునిక ప్రయాణ సౌకర్యాలతో, ఉత్తర భారత యాత్రలు నిర్వహిస్తూ ప్రతి తెలుగింటా సుపరిచితమైన సదరన్ ట్రావెల్స్ వారి అనుబంధ సంస్థ "HOTEL SOUTHERN, Karol Bagh, New Delhi లోని ప్రముఖ వ్యాపార కూడలిలో, అధునాతన సౌకర్యములతో నిర్మింపబడి, 100 రూములు, Business Centre, విజయవాడ / అమరావతి రెస్టారెంట్లు గల హోటల్ సదరన్‌లో విడిది చేయగలరు.
Free pick up from Nizamuddin / New Delhi Railway Stations and Domestic Airport

అంటారు. కాబట్టే మంచివారు, దైవము సమాంతర రేఖలవంటివారు. మంచితనం, దైవత్వం ఎప్పుడూ ఢీకొనవు. ఘర్షించవు. కాబట్టి జయవిజయులు సుజనులుగా పుట్టి వుంటే తిరిగి వైకుంఠప్రాప్తి అంతత్వరగా అయి వుండేదికాదు. దైవద్వేషులు ఎప్పుడూ దైవంతో ఘర్షణ పడుతూ వుంటారు, లంబరేఖవలె. ఇక్కడ లంబరేఖ ఇంకొక రేఖను కోసివేసే సామ్యం గమనింపవలసి డా౹౹రెడ్డిగారు ఒక అనుబంధ ప్రశ్నవేస్తూ అట్లైతే "మనమంతా దుష్టులెందుకు కాకుడదు?" అన్నారు. కైలాసం కొంచెం ఆలోచించి పరమాత్మ తత్వం ఏమిటంటే తన దగ్గరకు వచ్చిన ప్రతి వస్తువునూ తననుగా మార్చివేస్తుంది. భగవంతునితో ఘర్షణపడే ఏ వస్తువైనా జర్జరితమై పోతుంది" అన్నారు. ఈ సమాధానం విన్న డా౹౹ రెడ్డిగారు ఆనందపరవశులయ్యారు. రాఘవ టెన్నిస్ ఆడేవారు. ఆయన క్రికెట్ క్రీడాకారుడు కాకపోయినా ఒక క్రికెట్ బ్యాటును కొన్ని దశాబ్దాల పాటు తమ గదిలో భద్రపరిచారు.

నవాబుల రీవితో హుక్కా పీల్చడం, స్పెన్సర్ సిగార్‌లు, సిగరెట్లు, సన్నని మంగళూరు బీడీలు పీల్చడం ఆయన సరదా. ఎక్కువగా పొగపీల్చేవారు కాదు. పొడుం డబ్బా పెట్టుకొనేవారు. అయితే నశ్యం పొడిని ముక్కు పుటాలకు దట్టించే వారుకాదు. పొడుం డబ్బాను ముక్కుకు దూరంగా వుంచుకొని వాసన చూసేవారు, ఆయన అలవాట్లకొక క్రమపద్ధతి వుండేది. ఆ స్థానంలోనే ఆ వస్తువును వుంచడం ఆయన అలవాటు.

వైద్య విషయంలో అలోపతి వైద్యులు డా౹౹ప్యాలి శ్రీనివాసాచార్, హోమియో వైద్యులు డా౹౹ జ్యోతిలింగం. ఆయుర్వేద వైద్యులు భాస్కరాచార్య రామచంద్రస్వామి గారలే ఆయన వైద్య ముఖ్యులు. స్వామిగారు స్వయంగా తయారుచేసిన లేహ్యాలను నేను రాఘవగారికి అందజేసినపుడు ఎంతో బాగున్నాయని మెచ్చుకొనేవారు అని చెప్పేవారు.

కళకోసం ఎంతో ఉదారంగా పైకాన్ని ఖర్చుచేసేవారో, ఆచారవ్యవహారాలకోసం అంత దుబారా ఖర్చులను అంగీకరించేవాడు కాదు. ఉపనయనానికి రూ.25/– మించి, వివాహానికి రూ. 250/– మించి ఖర్చు పెట్టకూడదని ఆయన సిద్ధాంతం. 1938లో తమ రెండవ కుమార్తె వివాహాన్ని తమ్ముని కుమారుని వివాహాన్ని 500రూ౹౹ ఖర్చుతోనే పూర్తి చేశారు. బంధువులకు ఆశీస్సులందింపవలసినదని జాబులు వ్రాశారు, విందుకు ఇంట్లోవారిని, పెళ్ళివారిని మాత్రమే పిలిచారు. సాయంత్రం మిత్రులకొక టీ పార్టీ ఇచ్చారు.

పత్ర వ్యవహారాల్లో అత్యంత శ్రద్ధాసక్తులు చూపేవారు. ఆయన లెటర్‌హెడ్‌పై టి. రాఘవ అని మాత్రమే వుండేది. వూరు, తేదీ వారే వ్రాసేవారు. వారి జాబుల్లో ఆత్మీయత తొణికిసలాడేది. చెల్లెలికి వ్రాసే ప్రతిజాబు ఏ్ననవ్వా ఎద్దీరా? చా కుడిదీరా? (అమ్మ గారు లేచారా? టీ సేవించారా) అనే కన్నడ వాక్యాలతో ప్రారంభమయ్యేది. రాఘవ గారి తల్లి చాల అరుదుగా తేనీరు సేవించేది. ఆయన మాత్రం ఉదయాన్నే టీ త్రాగేవారు.

స్నేహితులనే కాక నౌకర్లను కూడా ఆయన ఎంతగానో ప్రేమించేవారు. రాఘవగారి కారు చాల పెద్దది, పాతది. కారు డ్రైవరు దేవదాసు రాఘవను దైవంగా భావించేవాడు. దర్జీ రమణప్ప రాఘవ భౌతికకాయాన్ని స్మశానానికి తరలించేటప్పుడు దారి పొడుగునా ఆ భౌతిక కాయానికి గొడుగు పట్టాడు. అదీ అతని అనుయాయులు చూపించే ప్రేమ.

రాఘవ స్వయంగా సంగీతకోవిదుడు కాదు.సంగీతం రాకపోవడం తనలోని లోపమేమో అని ప్రకటించినపుడు విశ్వకవి రవీంద్రనాథ టాగూరు మీ నోట వెలువడే ప్రతివాక్యం సంగీతాత్మకంగా వుంటుందని అన్నారు. రాఘవ పాటలకు టి. కుమారస్వామి (కొమ్మి) హార్మోనియం, విన్నూత చైతన్యాన్ని కలిగించేది.రాఘవ ఆత్మీయతను తలచుకున్నపుడల్లా ప్రముఖ నటులైన జోళదరాసి దొడ్డనగౌడగారు ప్రబంధకర్తయైన పెద్దనవలె "బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబ" నగుచు అంటూ వుండేవారు. మనిషిగా పుట్టిన నటరాజాంశ సంభూతుడాయన.

రచన : **జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

## శ్రీ పదార్చన

రచన: **యస్.మునిసుందరం**

**క**నరే...పాడరే... కొనియాడరే
కనులవిందై కురియు గోవిందునందాలు... కనరే

కాంతి రేఖలై వెలయు వైకుంఠ నామాలు
రాకా సూర్యులై శ్రీ హరి కన్నుల వెలుగులు
అధరాల దీపించు చిగుర నవ్వుల కొనలు
ప్రభాత సంధ్యలు హరి మోమున మెరపులు... కనరే

గుండెల కొలువై భూదేవి శ్రీదేవి
మణిమయకాంతుల ముత్యాల మురిపాలు
కొండల ఘోషించు గోవిందుకవనాలు
కనులు చాలవు వేలు కనగహరి అందాలు... కనరే

అంతయూ మట్టియని చూపు కుడిచేయి
వామహస్తము చూపు అంతటానేనంచు
పాదాల ప్రవహించు గంగమ్మ కులుకులు
నాదాలు పలికించు వేంకటేశు అందాలగంధాలు... కనరే

# ప్రభాకరస్వామి శ్రీసాయినాథ ప్రస్థానం

హైదరాబాదులో ప్రభాకరస్వామి వృత్తిరీత్యా ఓ ప్రభుత్వ ఉద్యోగి. ప్రవృత్తి రీత్యా కళాకారుడు, నటుడు, ప్రయోక్త, రేడియో, టీవీ ఆర్టిస్టు, వ్యాఖ్యాత, శాస్త్రీయ సంగీత నృత్య కళాకారుడు, వేదాంతి, హిందీ, ఇంగ్లీషు, తెలుగు, కన్నడ భాషలలో ఉపన్యాసకుడు, రచయిత బహుముఖి. ఆ 'వ్యాఖ్యాన వాచస్పతి'గా ప్రాచుర్యమందిన ప్రభాకరస్వామి కలం నుండి జాలువారిన నాటకం శ్రీ సాయినాథ ప్రస్థానం మధుర కంఠీరవ– శ్రీ వల్లూరి శ్రీహరి రావు నిర్వహణలో 3 రోజుల నిర్జీవుడై అనంతరం పునర్జీవితుడైన సాయినాథుని లీలాఘట్టాన్ని **'శ్రీ సాయినాథ ప్రస్థానం'**గా రచించారు. పద్యనాటకంగ, సంగీతభరితంగ మలచబడిన యీ నాటకం చలివేంద్రపాలెం, ఏలూరు, బళ్ళారిల లో సీతారామాంజనేయ నాట్యమండలి, ఏలూరువారిచే ప్రదర్శించబడింది. అందుకు తార్కాణమే ఈ సన్నివేశం. సాయితత్వం కళ్ళకు కట్టినట్లుసాగే భక్తిరస మయమైన నాటక ప్రదర్శన ప్రదర్శించాలనే కుతూహలం కలవారు తనను (ప్రభాకర స్వామి ఫోన్–09912857549) సంప్రదించవచ్చునని తెలియచేస్తున్నారు. ●



'ప్రముఖాంధ్ర' ఒక్కటే తెలుగు భాషా సంస్కృతులకూ తెలుగువారికి సేవ చేస్తున్న పత్రిక



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



**82**

## పండ్రెండవ అధ్యాయము - భక్తి యోగము

**'సమర్ప్యైకశ్చేత స్సరసిజ ముమానాథ భవతే సుఖేనావస్థాతుం జనిహ న జనాతి కిమహో'**

'ఉమాపతియగు ఓ పరమేశ్వరా! చిత్తమను కమలపుష్పమును మీకర్పించి సుఖముగనుండుటను జనులు తెలిసికొనలేకున్నారే!' అని శ్రీశంకర భగవత్పాదులు శివానందలహరియందు తెలిపిన చందము ఆ మనఃకుసుమములచే భక్తుడు భగవానుని ఆరాధించును. ఆ పుష్పములెవ్వి? ఈ అధ్యాయమునందు తెలుపబడిన ఆ ముప్పదియైదు సుగుణములే ఆ పుష్పములు.

మఱియు-

**అహింసా ప్రథమం పుష్పం పుష్పమిన్ద్రియనిగ్రహఃసర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేసతౌ**

**శాన్తిపుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పం తథైవచ సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రతీకరం భవేత్.**

అని చెప్పబడినట్లు అహింసా, ఇంద్రియనిగ్రహము, సర్వభూతదయ, క్షమ, శాంతి, తపస్సు, ధ్యానము, సత్యము అను యెనిమిది పుష్పములు విష్ణుభగవానునకు చాలా ప్రతీకరములై యుండును. కావున బాహ్యపుష్పాదులతోబాటు ఈ సద్గుణ రూపమనఃపుష్పములచే గూడ భగవానుని ఆరాధించుట శ్రేయోదాయకము. కాబట్టి ఈ అధ్యాయమందు తెలుపబడిన సద్గుణములన్నిటిని ముముక్షువు చక్కగ నభ్యసించి, భగవంతునకు ప్రీతిపాత్రుడు కావలయును.

ఈ ప్రపంచమున మనుజుడు సంపాదింపదగిన సమస్తపదార్థములందును సర్వోత్తమమైనది, అత్యంతమూల్యవంతమైనది ఈ భగవత్ప్రీతియే అయియున్నది. కావున దానిని తప్పక సంపాదింపవలయును, అయితే అది యెట్లు లభింపగలదు? ఈ అధ్యాయమందుగాని, గీతయందు తక్కినచోట్లగాని తెలుపబడిన సద్గుణరాధనం తను చక్కగా అవలంబించినచో భగవానుడు ప్రీతినొందుదురు. 'భక్తిమాన్ మే ప్రియోనరౌ' (అట్టి సుగుణములు గల భక్తుడు నాకు ప్రియుడు)- అని వారు చెప్పనే చెప్పిరి. ఒకనికి భగవంతునిపై ప్రీతియుండవచ్చుగాని, భగవంతున కాతనిపై ప్రీతికలిగినదాయని ఆలోచించుకొనవలసియుండును. భగవద్వాక్యములకు, శాస్త్ర వాక్యములకు వ్యతిరిక్తముగ నడచినచో మనుజుడు ఏ కాలమందును భగవత్ప్రీతిని, భగవదనుగ్రహమును సంపాదించజాలడు. కాబట్టి భగవత్ప్రోక్తములైన ఈ ముప్పది యైదు సుగుణములను జనులు అవలంబించి దైవానుగ్రహమునకు పాత్రులు కావలయును.

'నరః' అని చెప్పినందువలన ఏ మానవుడైనను అట్టి స్థితిని అనగా భగవదను గ్రహమును బడయవచ్చునని తెలిపినట్లైనది.

**20. యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే**
**శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః.**

**వ్యాఖ్య:** పైన తెలుపబడిన ధర్మములను శ్రద్ధాభక్తులతో అనుష్ఠించువారికి కలుగు ఫలితమును వచించుచున్నారు. ఏదియైన ధర్మమును బోధించునపుడు దాని ఫలితమును గూడ చెప్పినచో ఆచరించువారికి దానిపై పరమవిశ్వాస మేర్పడు చుండును. అందువలననే కాబోలు భగవానుడు భక్తునిలక్షణములను పేర్కొని కట్టకడకు వాని ననుష్ఠించుటవలన కలుగు గొప్ప ఫలితమును చెప్పివైచిరి. ఆ ఫలితమేమి? 'తే అతీవ మే ప్రియాః'- భగవంతునకు పరమప్రీతిపాత్రులగుటయే, ఇంతకుమించిన ఫలము జీవులకేమికావలయును? అదియున్నచో అన్నియు లభించినట్లే. అది లేనిచో తక్కినవి యెన్నియున్నను నిరుపయోగములే- భగవత్కృపకు మించిన వస్తువు ముల్లోకములందును మఱియొకటిలేదు. ఏలయనగా, అట్టి కృప మోక్షమునకు దారితీయును. ఎట్లనిన భగవదనుగ్రహముగలవారికి బుద్ధియోగము (తత్త్వవిచారణాశక్తి) సంప్రాప్తించును. (దదామిబుద్ధియోగమ్) దానిచే నతనికి మోక్షము సన్నిహితమగును.

'ధర్మ్యామృతమ్'- పైన తెలుపబడిన ధర్మములు అమృతరూపమున వర్ణింపబడి నవి. ఎందువలననగా, జననమరణములనుండి తప్పించగల సామర్థ్యము వాని యందు గలదు. జీవుని అమరునిగ చేయగలశక్తి వానియందు గర్భితమైయున్నది. భగవానుడు కరుణతో అమృతవర్షమును కురిపించిరి. వారి వారి బుద్ధియనుపాత్ర నిండుగ ఆ అమృతమును పట్టి తనివితీర త్రాగుట జీవులధర్మము. ఎవరట్లుచేయరో వారు ఆ అమృతమును త్రావు సౌభాగ్యమును చేతులారా జారవిడుచుకొనినవారే యగుచు సంసారదావాపీడితులై దుర్భరయాతనల ననుభవించవలసివచ్చును. అయితే ఆ ధర్మముల నే ప్రకారమనుష్ఠించవలెను?

'శ్రద్దధానాః'- శ్రద్ధతో ననుష్ఠించవలెనని చెప్పబడినది. ఒకతూరి కాదు, రెండుతూర్లుకాదు, భగవానుడనేకతూర్లు ఈ శ్రద్ధ యొక్క ఆవశ్యకతలను గీతయందు పేర్కొనుచుండుట గమనింపదగియున్నది. మఱియు 'మత్పరమాః'- పరాత్పరుడే పరమగతియని నమ్మివారిని ధ్యానించుచు అయా సుగుణములను, ధర్మములను గీతాచార్యులభావమైయున్నది. పాఠశాలలో ఉపాధ్యాయునకు ప్రీతిపాత్రుడైయుండు విద్యార్థి యొక్క భవిష్యద్విద్యాభివృద్ధి విషయమై ఏలాటి సంశయ మెట్లుండదో, తండ్రి యొక్క అభయహస్తము క్రిందనున్న చంటిపిల్లవాని యొక్క యోగక్షేమముల విషయమై ఏ సందేహమున్న ఎట్లుండదో, అట్లే భగవంతునకు మిక్కిలి ప్రీతిపాత్రుడై యుండు జీవుని యొక్క మోక్షవిషయమై ఏ సందియమునూ ఉండదు. అతడు కడతేరినట్లేయగును, కాబట్టి ముముక్షువులు త్వరబడి భగవత్ప్రోక్తమగు ఈ ధర్మామృతమును తనివితీర పానముచేసి కృతార్థులగుటకై యత్నింపవలయును. 'యేతు'- అని 'యచ్ఛబ్ద' ప్రయోగము చేయుటవలన ఎవరైనను సరియే వానిని శ్రద్ధతో ననుష్ఠించినచో మోక్షభాగులు కాగల్గుదురని భావము.

**ఓమ్**

**ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీ కృష్ణార్జున సంవాదమునగు శ్రీ భగవద్గీతలందు భక్తియోగమను పండ్రెడవ అధ్యాయము**

**ఓమ్ తత్**

*(తరువాయి వచ్చే సంచికలో)*

**SRI RAJARAJESWARI JEWELLERY**

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*